
ప్రజాశక్తి
ఆదివారం 25 జూన్ 2023
5
పార్వతీపురం మన్యం



పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం కోట : హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతిఏటా గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకటించే పద్మ అవార్డులు (పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ) ఎంపికకు వివిధ రంగాలాలో/విభాగాలలో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సెట్విజ్ సిఇఒ బి.రామగోపాల్ తెలిపారు. కళలు, సాహిత్యము-విద్యా రంగం, క్రీడలు, వైద్యం, సమాజ సేవ, సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ప్రజా సంబంధాలు, పౌర సేవలు వ్యాపారం, పరిశ్రమలు మొదలగు రంగాలలో విశేష ప్రతిభ కనబరచిన యువత/ వ్యక్తుల నుంచి పద్మ అవార్డులకు ఎంపిక నిమిత్తం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని యువత ఆసక్తి గల వారు ముఖ్యకార్యనిర్వహణాధికారి, యువజన సర్వీసుల శాఖ, సెట్విజ్, విజయనగరం కార్యాలయానికి వ్యక్తిగత వివరాలతో దరఖాస్తు చేయాలని తెలిపారు. పూర్తి వివరాలు కోసం https://awards.gov.in, https://padmaawards.gov.in వెబ్‌సైట్‌లను సందర్శించి, తప్పనిసరిగా ఆన్లైన్ లో దరఖాస్తులను వచ్చేనెల 10లోగా సమర్పించాలని తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ నెంబరు 9849913080ను సంప్రదించాలని కోరారు.



శిథిలావస్థలో ఉన్న సీతంపేట గురుకులం

అసౌకర్యాల నడుమ .. చదువుకొనేదెలా?

- ఉత్తుత్తి ప్రకటనలతో కాలయాపన
- నేటికీ పూర్తికాని నాడు-నేడు పనులు
- అరకొర వసతులతో కొనసాగుతున్న పాఠశాలలు
- అవస్థలు పడుతున్న విద్యార్థులు

'మనబడి నాడు-నేడు కార్యక్రమంతో పాఠశాలల రూపురేఖలన్నీ మారిపోతున్నాయి. ఈ విద్యాసంవత్సరం ప్రారంభం నాటికే కార్పొరేట్ తరహాలో అన్ని హంగులతో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతా'మంటూ పాలకులు ప్రకటనలు గుప్పించారు. ఆచరణకొచ్చేసరికి అంతా ఊకదంపుడు ప్రసంగాలేనని తేలిపోయింది. ఈ ఏడాది జూన్ 12న పాఠశాల పునప్రారంభానికే నాడు-నేడు పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా, ఎక్కడా అమలు కాలేదు. దీంతో విద్యార్థులు మరోసారి అసౌకర్యాల నడుమ చదువులు కొనసాగిస్తున్నారు.

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఐటిడిఎ పరిధిలో 47 ఆశ్రమ పాఠశాలలు, 16 పోస్టుమెట్రిక్ వసతిగృహాలు, 193 జిపిఎస్ పాఠశాలలు, 77 ప్రాథమిక పాఠశాలల్లో సుమారు 25 వేల మంది విద్యనభ్యశిస్తున్నారు. వీటిలో 193 జిపిఎస్ పాఠశాలల్లో సుమారు 5వేల మంది విద్యార్థులున్నారు. ఎగువదారభ, బొడ్డగూడ, అబలసింగి, పెద్దరాజపురం.. ఇలా పది గ్రామాల్లోని పాఠశాలలకు పక్కా భవనాల్లేవు. విద్యార్థులకు ఆరుబయటే పాఠాలు బోధించాల్సిన పరిస్థితి నెలకొంది. 77 ప్రాథమిక పాఠశాలల్లో 4,162 మంది విద్యార్థులు చదువుతున్నారు. పొంజాడ, దాసు గుమ్మడ, కడగండి, గుమ్మడ, రామానగరం, చిన్న పల్లంకివలస తదితర ప్రాథమిక పాఠశాలలకు పక్కా భవనాల్లేక రేకుల షెడ్డుల్లోనే తరగతులు నిర్వహిస్తున్నారు. సీతంపేట బాలుర గురుకులంలో 326 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఈ భవనం ఎప్పుడు కూలిపోతుందోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. గతేడాది ఈ పాఠశాలకు నూతన భవనం మంజూరైనప్పటికీ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. మరోవైపు రహదారి కూడా లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. రాళ్లు తేలిన రహదారితో అవస్థలు పడుతున్నారు. హ్యాండ్ బోరు మంజూరు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. చిన్నబగ్గ గిరిజన సంక్షేమ ఆశ్రమ, బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి నుండి పదో తరగతి వరకు 240 విద్యార్థులు విద్యనభ్యశిస్తున్నారు. ఇక్కడి విద్యార్థులను తాగునీటి సమస్య వేధిస్తోంది. నాడు-నేడు కింద మంజూరైన పనుల్లో డైనింగ్ హాలు, రేకుల షెడ్డు పనులు పూర్తి కాలేదు. దీంతో విద్యార్థులకు కష్టాలు తప్పడం లేదు. సీతంపేట బాలికల గురుకుల కళాశాలలో 140 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి డైనింగ్ హాల్ లేక అవస్థలు పడుతున్నారు. 140 సీట్లకు 545 దరఖాస్తులు వచ్చాయి. ఇక్కడ విద్యకు ఏస్థాయిలో డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. అందుకే సీట్లు పెంచాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.



నాడు-నేడు పనులు పూర్తికాని చినబగ్గ ఆశ్రమ పాఠశాల

పోస్టుల కొరత

ఆశ్రమ పాఠశాలలు, జిపిఎస్ పాఠశాలల్లో 260 మంది ఉపాధ్యాయుల పోస్టులు కొరత ఉంది. ఆశ్రమ పాఠశాలలో హెల్త్ వాలంటీర్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. నాలుగో తరగతి సిబ్బంది, కుక్కు కమాటి, వాచ్‌మెన్ పోస్టు ఖాళీలు ఉన్నాయి. గతంలో హాస్టళ్ల నిర్వహణకు, విద్యార్థుల మెడికల్ బిల్లులు ఐటిడిఎ నుంచి చెల్లించేవారు. ప్రస్తుతం ఈ పరిస్థితి కనిపించడం లేదు.

డిడి వివరణ



ఇదే విషయంపై గిరిజన సంక్షేమ శాఖ డిడి ఎం.శ్రీనివాసరావును వివరణ కోరగా, తాగునీటి సమస్య వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. హెల్త్ వాలంటీర్ల కోసం ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. ఇప్పటికే ఐటిడిఎ పిఒ.. వైద్యాధికారులకు పాఠశాలలో వైద్యపరీక్షలు నెలకొకసారి చేయాలని ఆదేశాలు జారీ చేశారని వివరించారు.


సిఎం సభకు సిద్ధమవుతున్న వేదిక

సిఎం పర్యటనకు ముమ్మరంగా ఏర్పాట్లు

ప్రజాశక్తి-కురుపాం

కురుపాంలోని సెయింట్ మోన్‌ఫార్ట్ పాఠశాల వద్ద సిఎం పర్యటనకు అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 28న కురుపాంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి.. అమ్మఒడి పథకం నిధులు విడుదల చేయనున్న నేపథ్యంలో ఆ పాఠశాల వద్ద సభా ప్రాంగణం ఏర్పాటు చేస్తున్నారు. సుమారు 40 వేల మందికి సరిపడేలా సభా వేదిక సిద్ధమవుతోంది. ఎటువంటి వర్షాలు వచ్చినా సభా ప్రాంగణంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమాల కోఆర్డినేటర్ తలశీల రఘురాం, కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్పి విక్రాంత్ పాటిల్, ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి దగ్గరుండి, ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు

కేసుల విచారణ వేగవంతం

ప్రజాశక్తి-సీతంపేట

బోగస్ ధ్రువపత్రాలపై విచారణపై శనివారం డిఎల్ఎస్‌సి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటిడిఎ పిఒ కల్పనకుమారి మాట్లాడుతూ కేసుల విచారణ వేగవంతం చేయాలన్నారు. శనివారం 5 కేసులను విచారించగా, వీటిలో 4 కేసులు పూర్తి చేసేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. మిగిలిన కేసులను జులై ఒకటో తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎపిఒ రోసిరెడ్డి, డిడి శ్రీనివాసరావు, డిటి కుమారి, సూపరింటెండెంట్ దేశ్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కల్పనకుమారి

జర్మనీలో నర్సింగ్ ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి-కలెక్టరేట్

జర్మనీ దేశంలో స్టాఫ్‌నర్స్ ఉద్యోగాలు పొందేందుకు జిల్లాలోని బిఎస్‌సి నర్సింగ్ చేసిన వారికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, టిఎకెటి ఇంటర్నేషనల్, ఎపిఎస్ఆర్‌టిఎస్ సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 20 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు ఉండి, సాధారణ ఆసుపత్రుల్లో రెండేళ్ల నర్సింగ్ అనుభవం కలిగి, జర్మన్ భాష నేర్చుకోవడానికి ఆసక్తి ఉన్నవారు అర్హులని తెలిపారు. తప్పనిసరిగా నర్సింగ్ గ్రాడ్యుయేట్ అయి ఉండాలని పేర్కొన్నారు. తాడేపల్లిలోని కెఎల్ యూనివర్సిటీలో జులై ఒకటో తేదీ నుంచి రెండు నెలలపాటు శిక్షణ ఇస్తారని తెలిపారు. జర్మనీ వెళ్లేందుకు విమానఛార్జీలు చెల్లిస్తారని చెప్పారు. జర్మనీలో ఉచిత భోజన, వసతి ఏర్పాటు చేస్తారని వివరించారు. మొదటి 6 నెలలు ప్రారంభ జీతం నెలకు వెయ్యి యూరోలు చెల్లిస్తారని, తరువాత 6 నెలలు ఉద్యోగంతోపాటు జర్మనీలో బి సర్టిఫికేషన్ కోసం శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి నెలకు 2,500 యూరోలు చెల్లిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 30వ తేదీలోపు www.apssdc.in రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, పూర్తి వివరాలకు 6305110947 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బస్సుయాత్రలో జిల్లా నాయకులు

ప్రజాశక్తి - విజయనగరం కోట

తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారంటీ ఇస్తూ ఇచ్చిన హామీలను ప్రజల వద్దకు తీసుకువెళ్లేందుకు నిర్వహిస్తున్న బస్సుయాత్ర కార్యక్రమం అనకాపల్లి పార్లమెంట్ స్థానంలో మూడో రోజు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం ఉమ్మడి జిల్లా నాయకులు గుమ్మిడి సంధ్యారాణి, మాజీ స్పీకర్ కావలి ప్రతిభ భారతి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ కొండపల్లి అప్పలనాయుడు, కోళ్ల లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్

అర్హులందరికీ గృహాలు

టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

అర్హులైన వారందరికీ గృహ సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎపి టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ తెలిపారు. శనివారం మండలంలోని అడ్డాపుశీల గ్రామంలో టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం అడ్డాపుశీల నాయకుల ఆహ్వానం మేరకు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన అందరికీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అన్ని సంక్షేమ పథకాలు చేరువయ్యేలా వాలంటీర్, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. అర్హులై ఉండి ఎవరైనా సంక్షేమ పథకాలు అందకుంటే జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వారి వివరాలు తెలుసుకుని, అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రాములమ్మ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్లాపస్ సేవలను వినియోగించుకోండి

విజయనగరం లీగల్ : పెర్మనెంట్ లోక్ అదాలత్ ఫర్ పబ్లిక్ యూటీలిటీ సర్వీసెస్(ప్లా పస్) సేవలను ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ్‌చక్రవర్తి అన్నారు. ప్రజలు ప్రతి రోజు వినియోగించు కొనే సేవలైన రవాణా, పోస్టల్, టెలిగ్రాఫ్, ఎలక్ట్రిసిటీ మొదలైన ప్రజా వినియోగ సేవలకు సంబందించిన వివాదాల పరిస్కార వేదికయే శాశ్వత లోక్ అదాలత్ అని అన్నారు. శనివారం న్యాయ సేవాసదన్‌లో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రజా సేవలలో ఏమైనా లోపాలుంటే ప్లాపస్‌ను సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

రీసర్వేలో ప్రభుత్వ భూముల గుర్తింపు

కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి-కలెక్టరేట్

రీసర్వేలో ప్రభుత్వ భూముల గుర్తింపు పనులను వేగవంతం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ నిశాంత్ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రాధాన్యతా భవనాలు, జగనన్నకు చెబుదాం, వైద్య ఆరోగ్యం, రీసర్వేపై సమీక్ష నిర్వహించారు. జవహర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో ఉండే ప్రభుత్వ భూముల సరిహద్దులను గుర్తించి రెవెన్యూ రికార్డుల్లో పొందుపరచాలన్నారు. ప్రభుత్వ భూములలో ఉండే కాలువలు, రోడ్లను పరిశీలించి నివేదికలు సిద్ధం చేయాలన్నారు. గ్రామ సర్వేయర్ లాగిన్‌లో వాటిని నమోదు చేయాలని సూచించారు. తరువాత విఆర్ఒ, జాయింట్ కలెక్టర్ లాగిన్‌లో భూముల మ్యుటేషన్ పూర్తి చేయాలని తెలిపారు. ప్రస్తుతం సుమారు రెండు లక్షల మ్యుటేషన్లు పూర్తి చేసినట్లు చెప్పారు. క్షేత్రస్థాయిలో సుమారు నాలుగు లక్షల వరకు మ్యుటేషన్ చేయాల్సి ఉందన్నారు. పాత భూముల రికార్డులను నవీకరించాలని కలెక్టర్లకు సూచించారు. ప్రతీ శనివారం ఆ వారంలో పూర్తి చేసిన ప్రభుత్వ భూముల వివరాల నివేదికలు పంపించాలని ఆదేశించారు.

అనంతరం జిల్లా కలెక్టర్ నిశాంత్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ప్రయివేట్ భూముల వివరాలను సేకరించాలని గ్రామ సర్వేయర్, విఆర్ఒలను ఆదేశించామని తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఎప్పటికప్పుడు సర్వేపై సమీక్ష చేస్తున్నారని వివరించారు. ప్రస్తుతం రెండో విడతలో 72 గ్రామాల్లో రీసర్వే చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకటరావు, డిఎంహెచ్ఒ బగాది జగన్మోహనరావు, జిల్లా సర్వే శాఖ అధికారి రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ఉపాధి అక్రమాలపై విచారణ

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-సాలూరు

మండలంలోని గిరిశిఖర పంచాయతీ డెన్సరాయిలో ఉపాధి హామీలో పనులకు బిల్లుల మంజూరులో జరిగిన అక్రమాలపై శనివారం డ్వామా ఎపిడి శ్రీహరి విచారణ చేపట్టారు. గ్రామంలోని ఫిర్యాదుదారులైన గిరిజనులను విచారించారు. బిల్లుల మంజూరులో జరిగిన అక్రమాలపై గిరిజనులు కొద్దిరోజుల క్రితం ఐటిడిఎ పిఒకి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడంతో విచారణకు ఆదేశించారు. తమకు జరుగుతున్న అన్యాయం గురించి గిరిజనులు విచారణ అధికారి శ్రీహరికి వివరించారు. పంచాయతీకి ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు మంజూరు చేయాలని కోరారు. నివేదికను పీడీకి అందిస్తామని ఎపిడి శ్రీహరి చెప్పారు.


విచారణ చేపడుతున్న ఎపిడి శ్రీహరి

ఐసిడిఎస్‌ను కాపాడుకునేందుకు

కలెక్టరేట్ వద్ద ఆందోళన

అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి జ్యోతిలక్ష్మి

ప్రజాశక్తి-పాచిపెంట


ఐసిడిఎస్‌ను కాపాడుకునేందుకు జులై 10, 11వ తేదీల్లో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్ వద్ద 36 గంటలపాటు ఆందోళన చేపడుతున్నట్లు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి గంటా జ్యోతిలక్ష్మి తెలిపారు. శనివారం యూనియన్ పాచిపెంట ఐసిడిఎస్ ప్రాజెక్టు అధ్యక్షులు టి.ప్రభావతి అధ్యక్షతన జరిగిన ప్రాజెక్టు సమావేశంలో ఆమె మాట్లాడారు. ఐసిడిఎస్‌ను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతోందన్నారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు బడ్జెట్ కేటాయింపులు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి నెలా గ్యాస్ సిలిండర్లు ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. అంగన్వాడీలను అవమానించేలా యాప్‌లో కొత్త వెర్షన్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు ఐసిడిఎస్‌ను పరిరక్షించుకునేందుకు దేశ వ్యాప్తంగా చేపడుతున్న పోరాటాలకు ప్రజలంతా సంఘీభావం తెలపాలని కోరారు. కార్యక్రమంలో ప్రాజెక్టు నాయకులు ఎన్.దాలమ్మ, సుశీల, రమ, బంగారమ్మ, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


అంగన్వాడీలనుద్దేశించి మాట్లాడుతున్న యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి జ్యోతిలక్ష్మి

ప్రజా సమస్యలు పక్కదారి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రజా సమస్యలను ఏకంగా పక్కదారి పట్టిస్తున్నాయా? నాయకులు కూడా రాజకీయ పబ్బం కోసం తెరవెనుక ప్రయత్నాలు చేసుకుంటున్నారా? అంటే ఔననే సమాధానం వినిపిస్తోంది. ఇందుకు కారణం లేకపోలేదు. యావత్తు జనం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోపుతున్న భారాలు, విధానపరమైన సమస్యలతో కొట్టుమిట్టాడుతుండగా వామపక్షాలు మినహా మిగిలిన రాజకీయ పార్టీలన్నీ రానున్న ఎన్నికలే లక్ష్యంగా తెరవెనుక ప్రయత్నాలు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా ఇటీవల కాలంలో విద్యుత్ ఛార్జీల పెంపు ప్రజలపాలిట పెనుభారంగా మారిన సంగతి తెలిసిందే. దీనిపై వామపక్షాలు, ముఖ్యంగా సిపిఎం, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యాన జనం రోడ్లపైకి వచ్చి నిరసన తెలియజేస్తున్నారు. ప్రజాగ్రహం రోజురోజుకూ పెరుగుతోంది. అడపాదడపా నిరసన కార్యక్రమాలు చేపట్టి, చేతులు ముడుచుకోవడం తప్ప ప్రజలకు అండగా నిలబడి ప్రభుత్వాన్ని నిలదీయడంలో టిడిపి ప్రతిపక్ష పాత్రపోషించ లేకపోతోంది. గతంలో టిడిపి కూడా విద్యుత్ ఛార్జీల పెంపుతో ప్రజల్ని ఇబ్బందులకు గురి చేసిందని, అప్పట్లో నిలదీసిన ప్రజలపై కర్కశంగా వ్యవహరించిందని, అందువల్లే ప్రజల విశ్వాసాన్ని కూడా పొందలేకపోతోందని పలువురు విశ్లేషిస్తున్నారు. ఇటు అధికార పక్షం మాత్రం విద్యుత్ ఛార్జీల భారాన్ని కప్పిపుచ్చుకునే విధంగా పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలతో కాలక్షేపం చేస్తోంది. మరోవైపు పోలవరం నిర్వాసితుల సమస్య రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైన నేపథ్యంలో జిల్లాలోని తోటపల్లి, తారకరామతీర్థసాగర్, పెద్దగెడ్డ, విశాఖ రాయ్‌పూర్ రహదారి, భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్వాసితుల సమస్య కూడా రచ్చకెక్కుతోంది. ముఖ్యంగా తోటపల్లి, తారకరామతీర్థసాగర్ నిర్వాసితులకు నేటికీ న్యాయం జరగలేదు. పరిహారం, పునరావాసం కల్పించడంలో కాంగ్రెస్, టిడిపి, వైసిపి ప్రభుత్వాలన్నీ విఫలమయ్యాయి. దీంతో, ఓవైపు భూములు కోల్పోయి, మరోవైపు పునరావాసానికి నోచుకోక బాధితులు అవస్థలు పడుతున్నారు. ఈనేపథ్యంలో సిపిఎం వారికి అండగా నిలుస్తోంది. అటు పెద్దగెడ్డ నిర్వాసితులదీ అదే పరిస్థితి. మరోవైపు గ్రామ సచివాలయాలు, ఆర్‌బికెలు, బల్కుమిల్క్ సెంటర్, వెల్‌నెస్ సెంటర్ తదితర ప్రభుత్వ భవనాలకు బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారులు అప్పులపాలయ్యారు. ఇటువంటి అప్పులతోనే పది రోజుల క్రితం బొబ్బిలి మండలం అలజంగి ఉప సర్పంచి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారనే చర్చ నడిచింది. సాక్షాత్తు వైసిపికి చెందిన సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు కూడా ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. వీటిపై ఇప్పటికీ ప్రభుత్వం స్పష్టమైన భరోసా ఇవ్వడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు బిల్లులు చెల్లింపునకు మీనమేషాలు లెక్కించడం వల్ల భవన నిర్మాణాలు కూడా అసంపూర్తి గోడలతో వెక్కిరిస్తున్నాయి. ప్రభుత్వ కార్యకలాపాలు పరాయి పంచల్లో సాగుతున్నాయి. మరోవైపు ఇటీవల కాలంలో ఇళ్ల స్థలాలు, చెరువులు ఆక్రమణలకు గురయ్యాయి. ఇటువంటి సమస్యలపై ప్రతి సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమానికి కుప్పలు తెప్పలుగా వినతులు, ఫిర్యాదులు వస్తున్న సంగతి తెలిసిందే. ఎస్.కోట నియోజకవర్గంలో ఆక్రమణలు జరిగాయంటూ సాక్షాత్తు వైసిపికి చెందిన ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు కూడా వ్యాఖ్యానించడం గమనార్హం. పుస్తకాల్లో ఇష్టారాజ్యాంగా పాఠ్యాంశాలు మార్చడం, ప్రైవేటు స్కూళ్లలో పుస్తకాల వ్యాపారం, ఫీజుల పెంపు తదితర సమస్యలపైనా జనం అసహనం వ్యక్తం చేస్తున్నారు. తమను కొనసాగించాలంటూ కెజిబివిల్లో గెస్ట్ లెక్చరర్లు రోడ్డెకారు. వీటిపై టిడిపి ప్రతిపక్ష పాత్రపోషించక పోగా, అధికార పక్షం పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలతో ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తోందని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





మాట్లాడుతున్న రామస్వామి

జిల్లా మహాసభను విజయవంతం చేయాలి

గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రామస్వామి

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

జులై 14, 15 తేదీలలో జరిగే గిరిజన సంఘం ఏడో జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, రావికోన సర్పంచ్ రామస్వామి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని చందలంగి, కొత్త చందలంగి, కొత్తవలస గ్రామాల్లో రామస్వామి ఆధ్వర్యంలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందించి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సంఘం పోరాడి సాధించుకున్న హక్కుల పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పి.బలరాం, టి.సుబ్బారావు, సోమేష్, వాసు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



బీజామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకాశ్

విత్తనశుద్ధికి బీజామృతం ఎంతో మేలు

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

బీజామృతంతో విత్తన శుద్ధి పంటకు ఎంతోమేలు చేస్తుందని ప్రకృతి వ్యవసాయం రీజనల్ ట్రిమ్మటిక్ లీడర్ కంచర్ల ప్రకాశ్ తెలిపారు. శనివారం పార్వతీపురం మండలం పెదబొండపల్లి గ్రామంలో రైతులకు వరి విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విత్తనశుద్ధికి బీజామృతం ఆవశ్యకత తెలియజేస్తూ రైతులతో సవివరంగా బీజామృత తయారీ విధానాన్ని నేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజామృతంతో విత్తన శుద్ధి చేయడం వల్ల విత్తనంలో ఉండే తెగులుతోపాటుగా భూమిలో ఉండే తెగులును నివారించ వచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఎపిసిఎన్ఎఫ్ మాస్టర్ ట్రైనింగ్ వై.శ్రీరాములు పాల్గొన్నారు.



బేబినాయనకు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

ఘనంగా బేబినాయన జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- బొబ్బిలి

టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. కోటలో అభిమానులు, కార్యకర్తలు కోలాహలం మధ్య వైభవంగా నిర్వహించారు. మాజీ మంత్రులు శత్రుచర్ల విజయ రామరాజు, సుజయకృష్ణ రంగారావు, మాజీ ఎమ్మెల్యేలు తెంటు రాజా, బి.చిరంజీవులు, మాజీ ఎమ్మెల్సీ డి.జగదీష్, కురుపాం నియోజకవర్గ ఇంచార్జి జగదీశ్వరి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బేబినాయనకు జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. బేబినాయనకు శుభాకాంక్షలు చెప్పేందుకు జనం క్యూ కట్టారు. బేబినాయన ఆరోగ్యంగా ఉండాలని శ్రీవేణుగోపాలస్వామి, గొల్లపల్లి శ్రీదాడితల్లి ఆలయాలు వద్ద కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు.

ఉర్రూతలూగించిన పల్సర్ బైక్ రమణ పాటలు

బేబినాయన పుట్టినరోజు సందర్భంగా కోటలో ఏర్పాటు చేసిన పల్సర్ బైక్ రమణ పాటల కచేరి అభిమానులు, కార్యకర్తలను ఉర్రూతలూగించింది. రమణ బృందం పాడిన జానపద గేయాలు ఆకట్టుకున్నాయి.

శుభాకాంక్షలు చెప్పిన చంద్రబాబు

బేబినాయనకు టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు చరవాణిలోను, ట్విట్టర్‌లో జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు.

ఎంఇఒను సస్పెండ్ చేయాలి: ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి- బొబ్బిలి

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు అమ్ముతున్న ప్రైవేట్, కార్పోరేట్ విద్యా సంస్థలకు కొమ్ముకాస్తున్న మండల విద్యాశాఖ అధికారిను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు మణికుమార్, నాయకులు వాసు, శివ డిమాండ్ చేశారు. ప్రైవేట్ గోదాంలో పుస్తకాలు అమ్మకాన్ని ఎస్ఎఫ్ఐ నాయకులు శనివారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొబ్బిలి పట్టణంలో సురెస్ స్కూల్‌లో పుస్తకాల పేరుతో వేలకు వేలు ఫీజులు వసూలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. పుస్తకాల గదిని సీజ్ చేయాలని అక్కడ ధర్నా నిర్వహించారు. విద్యాహక్కు చట్టం ప్రకారం పాఠశాల పరిధిలో ఎటువంటి అమ్మకాలు చేయకూడదని ఉన్నా సరే ఇటువంటి పాఠశాలలు అన్యాయంగా వేలకు వేలు వసూలు చేయడం దుర్మార్గం అన్నారు. వీటిని పట్టించుకోవాల్సిన ప్రభుత్వం కళ్ళు మూసుకుపోయి వ్యవహరిస్తుందని అన్నారు. పాఠశాలలో మూడవ తరగతి పిల్లవాడికి 6 వేల రూపాయలకు పైగా వసూలు చేయడం చూస్తే ఇది విజ్ఞానాన్ని పంచె పాఠశాల లేక విద్యార్థుల రక్తాన్ని ధనం రూపంలో పీల్చే పాఠశాలో అర్థం కావడంలేదన్నారు. పుస్తకాలు అమ్మకుండా చూస్తామని ఎంఇఒ హామీ ఇవ్వకపోవడంతో పాటు అస్సలు పట్టించుకోని పరిస్థితి ఉందని ఇలా కార్పొరేట్ విద్యా సంస్థలకు దన్ను కాస్తున ఎంఇఒ పై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐగా డిమాండ్ చేస్తున్నామన్నారు. లేని పక్షాన తీవ్ర ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సిహెచ్.వాసు, ఎస్.కేశవ, కె.డేవిడ్, కె.శ్రీను, బి.తేజ పాల్గొన్నారు.

క్వారీ కార్మికుడు దుర్మరణం

వేపాడ: మండలంలోని సోంపురం పంచాయతీలో ని శ్రీదేవి రాతి క్వారిలో జరిగిన ప్రమాదంలో ఒక కార్మికుడు మృతి చెందాడు. గెమ్మెల బుద్ధ(30) శనివారం క్వారీలో డ్రిల్లింగ్ చేస్తూ సుమారు 150 అడుగుల ఎత్తు నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

లారీ ఢీకొని టీచర్ మృతి

ప్రజాశక్తి- విజయనగరం

విజయనగరం రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళా టీచర్ సోమయాజుల సునీత (32) మృతి చెందారు. ఈమె పట్టణంలోని ఒక ప్రయివేటు పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. మధ్యాహ్న భోజనం అనంతరం తిరిగి స్కూటీపై పాఠశాలకు వెళుతుండగా సింగపూర్ సిటీ సమీపంలో విజయనగరం నుంచి నాతవలస వైపు వెళుతున్న లారీ బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'జగనన్న సురక్ష'తో విస్తృతంగా సేవలు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలకు మరింత విస్తృతంగా సేవలు అందుతాయని ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. శనివారం మున్సిపాలిటీలోని ప్రజాప్రతినిధులు, అధికారులు సమక్షంలో వాలంటీర్లు, గృహసారథులకు శిక్షణ శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలోని వాలంటీర్లు, గృహసారథులు, నాయకులంతా కలిసి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లాలని చెప్పారు. వారికి ఏ సమస్య ఉన్నా సరే వాటిని వాలంటీర్లు నమోదు చేసుకుని, ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో రిజిష్టర్ చేయించాలని చెప్పారు. వాటిని సచివాలయ ఉద్యోగులకు అందజేస్తే వారం రోజుల తరువాత మున్సిపల్ అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి ప్రజల నుంచి వచ్చిన సమస్యలకు తక్షణ పరిష్కారం చూపిస్తారని తెలిపారు. వెంటనే సంబంధిత ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేసి లబ్ధిదారులకు అందిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి, వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, యిండుపూరు గున్నేశ్వరరావు, వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు, స్టేట్ డైరెక్టర్లు జె.శ్రీదేవి, మజ్జి నాగమణి, మెహర్ ప్రసాద్, చెవిటి వెంకటరమణ, జెసిఎస్ కన్వీనర్ జి.మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురంటౌన్.. మాట్లాడుతున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సాలూరు : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభించనుందని మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు చెప్పారు. శనివారం ఏడో వార్డు సచివాలయంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా అర్హులైన పేదలను గుర్తించి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెసిఎస్ కన్వీనర్ గిరి రఘు, వైసిపి నాయకులు బి.బాలకృష్ణ పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : ప్రభుత్వ సంక్షేమ ఫలాలు, సేవలు ప్రజలకు మరింత చేరువ చేసేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం అమలు చేస్తున్నట్లు వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్ తెలిపారు. గుమ్మలక్ష్మీపురంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మారుతి వీధి, కాంప్లెక్స్ వీధుల్లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నవి లేనివి అడిగి తెలుసుకున్నారు. అర్హులుగా ఉండి ఏదైనా ప్రభుత్వ సంక్షేమ పథకం అందకపోతే తెలపాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సాల్మన్‌రాజు, ఇఒపిఆర్‌డి జగదీశ్‌కుమార్, గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బి.గౌరీశంకర్ రావు, పంచాయతీ కార్యదర్శి కిశోర్ కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గరుగుబిల్లి : జగనన్న సురక్షపై అవగాహన కల్పించేందుకు రావివలసలో డోర్ టు డోర్ కార్యక్రమాన్ని జెడ్‌పి వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో తహశీల్దార్ జనార్దన్, ఇఒపిఆర్‌డి గోపాలరావు, డిప్యూటీ తహశీల్దార్ పిఎస్ఎల్ కుమార్ పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని అంటిపేటలో ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎల్ ప్రసాద్ జగనన్న సురక్ష కార్యక్రమంపై సర్వే నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించే దిశగా ఈ కార్యక్రమం ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం కోసం ఇప్పటికే రెండు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.





సీతానగరం, గుమ్మలక్ష్మీపురం... గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ ప్రసాద్, గుమ్మలక్ష్మీపురం వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, నాయకులు



సాలూరు.. మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు

తల్లిదండ్రులే యువతకు మార్గనిర్దేశకులు

రెండో అదనపు జిల్లా జడ్జి దామోదరరావు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా సరైన మార్గంలో జీవించేలా పెంచాలని రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు తెలిపారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం రెండో అదనపు జిల్లా కోర్టు సమావేశ మందిరంలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువతను సరైన మార్గంలో నడిపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. యువత మాదకద్రవ్యాలు సేవించినా, కలిగి ఉన్నా, రవాణా చేసినా చట్టప్రకారం నేరస్తులు అవుతారన్నారు. ప్రతీ ఏడాది నాలుగు లక్షల మంది యువతులు అదృశ్యం అవుతున్నారని, దానికి కారణం యువత సరైన పద్ధతిలో పెరగకపోవడం, మానవ అక్రమరవాణా, మాదకద్రవ్యాల వినియోగమని తెలిపారు. పిల్లలకు చిన్నతనం నుండే వారు స్వతంత్రంగా జీవించేలా అన్ని పనుల్లో శిక్షణ ఇవ్వాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. చిన్నతనం నుండే కష్టపడి పనిచేయడం నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని తెలిపారు. ఎక్కువ గారాబం చేయడం వల్ల చెడు వ్యసనాలకు గురై, జీవితాలను నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. దానిని రూపు మార్చాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. ఉమ్మడి కుటుంబం ద్వారానే మంచి ప్రవర్తన, మంచి అలవాట్లు వస్తాయన్నారు. ఈ ఆధునిక ప్రపంచంలో జీవన విధానంలో చాలా మార్పులు రావడంతో జల్సాలు పేరిట యువత చెడు వ్యసనాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రేమ పేరుతో జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, తల్లిదండ్రులను మించిన ప్రేమ ఈలోకం లేదని గుర్తుచేశారు. యుక్తవయస్సులో గల పిల్లలతో తల్లిదండ్రులు వీలైనంత ఎక్కువ సమయం గడిపి వారి అవసరాలు మాత్రమే కాక, వారి మనోగతాన్ని తెలుసుకొని ప్రవర్తించాలని సూచించారు. పిల్లల చదువులు, ర్యాంకులకే ప్రాధాన్యత ఇవ్వకుండా వారికి మానవతా విలువలు, మంచి ప్రవర్తన కూడా నేర్పించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలను మంచి ప్రయోజకులుగా తీర్చిదిద్దే బాధ్యత అంగన్వాడీ వర్కర్లపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.రమేష్, అదనపు జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ డి.సౌజన్య, జిల్లా శిశు సంక్షేమ అధికారి గౌరేశ్వరి, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రెండో అదనపు జిల్లా జడ్జి దామోదరరావు

సీతానగరం : మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ పి.దుర్గాప్రసాద్ కోరారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, సమాజం పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి మంచి ఆలోచనలతో ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బి.రేణుక, అధ్యాపకులు రవికుమార్, వినోద్, రామకృష్ణ, ఎక్సైజ్ సిబ్బంది ఎ.శ్రావణ్‌కుమార్, ఎల్.జనార్ధన, ఎం.శ్రావణి పాల్గొన్నారు.



ఎంపిడిఒకు స్వాగతం పలుకుతున్న అధికారులు

పార్వతీపురం ఎంపిడిఒగా రమేష్

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

పార్వతీపురం ఎంపిడిఒగా శనివారం శంబంగి రమేష్ బాధ్యతలు చేపట్టారు. ఎఒగా గుంట్రెడ్డి రమణమూర్తి కూడా చార్జి తీసుకున్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన వీరికి ఇఒపిఆర్‌డి కృష్ణుడు, గ్రామ సచివాలయాల సంఘం నాయకులు జగన్మోహన్, తదితరులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

పండ్లు, రొట్టెలు పంపిణీ

ప్రజాశక్తి-సీతానగరం

టిడిపి బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన పుట్టినరోజు సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు టిడిపి నాయకులు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెదబోగిలి సర్పంచ్ జొన్నాడ తేరీజమ్మ గరికయ్య, టిడిపి నాయకులు హరిగోపాలరావు, సబ్బన్న, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వీటిని పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ బి.శ్రీనివాసరావు, ప్రసాద్, ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న గెస్ట్ టీచర్లు

మూడో రోజుకు గెస్ట్ టీచర్ల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తొలగించిన కెజిబివి గెస్ట్ టీచర్‌లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, నోటిఫికేషన్ రద్దు చెయ్యాలని డిమాండ్ చేస్తూ గెస్ట్ టీచర్లు చేపట్టిన ఆందోళన మూడోరోజు శనివారం కూడా కలెక్టరేట్ వద్ద కొనసాగింది. సిఐటియు నాయకత్వంలో గెస్ట్ టీచర్లంతా కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ గెస్ట్ టీచర్లుగా కొనసాగుతున్న పిజిటి, సీట్ టీచర్లను అర్ధాంతరంగా తొలగించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. న్యాయం చెయ్యాల్సిన ప్రభుత్వం తమను రోడ్డున పడేలా చీకటి జీవో తీసుకువచ్చిందని అన్నారు.

జిల్లాల్లో జరుగుతున్న సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉద్యోగాలకు దూరం చేసేలా ఉందని, తమ స్థానంలో వేరే వారిని పెట్టేలా ఉంది కాబట్టి వెరిఫికేషన్ ప్రక్రియలో ముందు నుంచి పనిచేస్తున్న టీచర్లకు పోస్టింగ్ ఇచ్చి, పర్మినెంట్ చేసి న్యాయం చెయ్యాలని డిమాండ్ చేశారు. కెజిబివి టీచర్లు చేస్తున్న న్యాయ పోరాటానికి సిఐటి యు అండగా ఉంటుందన్నారు. ధర్నా లో గెస్ట్ టీచర్లు ఎ.రమాకుమారి, ఎల్.సూరీడమ్మ, తనుజ, రాధ, భారతి తదితరులు పాల్గొన్నారు.



విచారణ చేపడుతున్న తహశీల్దార్ బాలమురళీకృష్ణ

స్థలం వివాదంపై తహశీల్దార్ విచారణ

ప్రజాశక్తి-సాలూరు

మండలంలో తోణాంలో ఇద్దరు వ్యక్తుల మధ్య స్థల వివాదంపై శనివారం తహశీల్దార్ ఆర్.బాలమురళీ కృష్ణ విచారణ చేపట్టారు. రిటైర్డ్ విఆర్ఒ నాగభూషణం తన స్థలం ఆక్రమించి, తనపై దౌర్జన్యం చేస్తున్నారని వల్లభనేని బ్రహ్మానందం అనే వృద్ధుడు జిల్లా ఎస్‌పికి ఫిర్యాదు చేశారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో ఆయన జిల్లా ఎస్‌పి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. అధికార పార్టీ నాయకుల అండతో రిటైర్డ్ విఆర్ఒ నాగభూషణం తనను బెదిరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై నిజమేమిటో తేల్చాలని ఎస్‌పి.. తహశీల్దార్ బాలమురళీకృష్ణని ఆదేశించడంతో ఆయన విచారణ చేపట్టారు. ఈ స్థలం గ్రామకంఠంలోనిదని, సర్వే చేసి నిర్ధారణ చేయాల్సి ఉంటుందని తహశీల్దార్ చెప్పారు.

నాడు-నేడు పనులపై అసంతృప్తి

ప్రజాశక్తి - కురుపాం

నీలకంఠాపురం పిహెచ్‌సిలో నాడు-నేడు పనుల్లో జాప్యంపై జిల్లా నోడల్ అధికారి వినోద్ అసంతృప్తి వ్యక్తంచేశారు. మండలంలోని ధర్మలక్ష్మీపురంలో 104 ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎఎన్ఎం, ఆశా వర్కర్ల రికార్డులను పరిశీలించారు. అనంతరం నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. నాడు-నేడు పనులు పరిశీలించి పనులు పూర్తి కాకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. త్వరగా పనులు పూర్తి చేయించాలని వైద్య అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు అభినవ్ కుమార్, ఎ.సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న జిల్లా నోడల్ అధికారి వినోద్

ఓటు హక్కుపై అవగాహన

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో పులిపుట్టి సమీపంలోని భారతి ఇంటర్నేషనల్ స్కూల్లో శనివారం విద్యార్థులకు ఓటు హక్కుపై ప్రిన్సిపల్ ఎస్.నవీన్‌కుమార్ అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఎస్‌పిఎల్, సిపిఎల్ ఓటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పిన్న వయసులోనే ఓటు వినియోగం, ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. ఓటు ఏ విధంగా వినియోగించాలో తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళీమోహన్, దివాకర్, సంతోష్, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఓటు హక్కు ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపల్ నవీన్ కుమార్

జనసేనలోకి పిఎసిఎస్ డైరెక్టర్

ప్రజాశక్తి- సీతానగరం

మండలంలోని తామరఖండి మాజీ ఉపసర్పంచ్, పిఎసిఎస్ డైరెక్టర్ ఏగిరెడ్డి అచ్యుతనాయుడు.. శనివారం జనసేన పార్టీలో చేరారు. జనసేన నియోజకవర్గ నాయకులు అక్కివరపు మోహనరావు సమక్షంలో అచ్యుతనాయుడుతోపాటు గ్రామ యువకులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ జనసేన అధినేత భావితరాల కోసం నిస్వార్థంగా పోరాడుతున్నారని తెలిపారు. పవన్‌కల్యాణ్ భావజాలం నచ్చి యువత, రాజకీయ వేత్తలు పార్టీలో చేరుతున్నారని చెప్పారు. అవినీతి లేని పాలన కావాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా పవన్ కల్యాణ్ సిఎం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి అల్లు రమేష్, నియోజకవర్గ నాయకులు చిప్పాడ సూర్యనారాయణ, జయశంకర్, జయప్రకాశ్, సివి రమణ, గులిపిల్లి శ్రీనివాసరావు, మూడడ్ల అప్పలనాయుడు, జాగాన నారాయణరావు, బోను అనిల్, సూర్యనారాయణ పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో జనసేన నాయకులు అక్కివరపు మోహనరావు